


మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక

శుక్రవారం 26 - సెప్టెంబర్ - 2025 ఎడిటర్ : కంచర్ల అచ్యుత రావు

# కోస్తాంధ్ర



| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
| --- | --- | --- |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |



# మున్సిపల్ శాఖలో ఐదు బిల్లులకు ఆమోదం



**అమరావతి ( మనసులో మాట ),సెప్టెంబర్ 25 :** పట్టణాభివృద్ధిశాఖకు సంబంధించి ఐదు బిల్లులను ప్రభుత్వం గురువారంఅసెంబ్లీలో ప్రవేశపెట్టింది.దీనిలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్‌చట్ట సవరణ 2025తోపాటు మరో నాలుగు సవరణల ను మంత్రి నారాయణ అసెంబ్లీలో ప్రతిపాదించారు. వీటన్నిటికీ సభ ఆమోదం తెలిపింది. వీటిల్లో నాలా చట్టం రద్దుతో మున్సిపాలిటీలు అదనపు అభివృద్ధి ఛార్జీల వసూలుకు సంబంధించిన అంశాన్ని ఆమోదించారు. అలాగే బహుళ అంత స్తుల భవనాలను ఇప్పటి వరకూ 18 మీటర్ల ఎత్తుకు నిర్మిస్తుండగా దాన్ని 24 మీటర్ల ఎత్తుకు పెంచుతూ పెట్టిన బిల్లు ఆమోదం పొందింది.అలాగే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు సంబంధించి బిపిఎస్ బిల్లునూ ఆమోదించారు. ఎపిలో పట్టణాల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు గతంలో జనవరి ఒకటోతేదీ గడువుగా ఉండేది. ఒకపై ఏప్రిల్, జులై, అక్టోబర్లోనూ నమోదు చేసుకునేలా అవకాశం కల్పించారు. వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ పేరును తాడిగడప మున్సిపాలిటీగా మార్చారు. దీనిపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు మాట్లాడారు. ప్రభుత్వ భూములను రెగ్యులరైజ్ చేయాలని విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే గణబాబు కోరారు. బిపిఎస్ వల్ల భవనాలకు చాలా వరకూ న్యాయం జరుగుతుందని అన్నారు.లిఫ్టుఫ్లోర్, వాటర్ ట్యాంకు, సూర్యఘర్‌కు మినహాయింపు ఇవ్వాలని కోరారు. జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇష్టం వచ్చినట్లు భవనాలు నిర్మించారని దానివల్ల యజమానులు ఇబ్బందుల పడుతున్నారని, ఇప్పటి వరకూ ఉన్న చిక్కుముడలన్నీ ఎత్తేసి భవనాలకు రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

# నక్సల్స్ పాత సిద్ధాంతాన్ని కొనసాగించవద్దు : చంద్రబాబు

**అమరావతి ( మనసులో మాట ), సెప్టెంబర్ 25 :** జగన్ ప్రభుత్వంలో మొదటి బాధితుడు తానే అని సీఎం చంద్రబాబు అన్నారు. నేడు ఆయన అసెంబ్లీలో ప్రసంగించారు. జగన్ అధికారంలో ఉండగా.. పవన్ కల్యాణ్ ను కూడా హైదరాబాద్ నుంచి రాకుండా అడ్డుకున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయని చంద్రబాబు అన్నారు. తనది కక్ష రాజకీయాలు కాదని.. బాధ్యత కలిగిన నాయకుణ్ణి కాబట్టే ప్రజలు నాలుగో సారి తనని సీఎం గా ఎన్నుకున్నా రన్నారు. ఈ సందర్భంగా అలిపిరి యాక్సెడెంట్ గురించి ఆయన ప్రస్తావించారు. '2003 లో అలిపిరిలో యాక్సిడెంట్ అయింది.. నేను మరో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నాం.. యాక్సిడెంట్ తర్వాత నేనే లేచి అంబులెన్స్ లో పడుకున్నా.. ఏమి జరిగింది అన్నాను.. నక్సల్స్ బ్లాస్ట్ అన్నారు.. 23 క్లైమోర్ మైన్స్ బ్లాస్ట్ చేసినా నేను బయట పడ్డ.. వేంకటేశ్వర స్వామి మహిమ ఉందా అంటే.. ఉందనే చెప్పాలి' అని సీఎం అన్నారు. నేనేం నక్సల్‌కు వ్యతిరేక మా..? కాదు.. నక్సల్ ఇంకా పాత సిద్ధాంతాన్ని కొనసాగించ వద్దని అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు చెప్పారు. నక్సల్స్ ని జన జీవన ప్రవంతి లోకి రండి అని తాను ఆనాడే చెప్పినట్లు చంద్రబాబు



తెలిపారు. కానీ తాను భయపడలేదని.. రాష్ట్రం కోసం నా ప్రాణం పోయినా పర్వాలేదు అని నాడు చెప్పానని గుర్తు చేశారు. రాయలసీమలో ఫ్యాక్షన్ లేకుండా చెయ్యాలి అనుకున్న పరిటాల రవిని ఆఫీస్ లో చంపేశారు.. వాళ్ళు చేసిన పనే మనం చేస్తే న్యాయం జరగదన్నారు.. తప్పు చేసి తప్పించుకుంటా అంటే కుదరదని హెచ్చరించారు. 2047 లో ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఉంటుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గంజాయి, డ్రగ్స్ వాడకం విపరీతంగా పెరిగిందని సిఎం తెలిపారు.

### అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై సిఎం ఆగ్రహం


ఎపి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సమావేశాలకు హాజరు కాని ఎమ్మెల్యేలపై సిఎం

2వ పేజీలో







# 'ప్రైవేట్'కు 6022 ఎకరాలు ఇచ్చినా..వచ్చిన ఉద్యోగాలు సున్నా : మంత్రి టిజి భరత్



**అమరావతి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** 'రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన 2024 జూన్ నుండి ఇప్పటి వరకు 1,555 ప్రైవేటు కంపెనీలకు 602.20 ఎకరాల భూములు ఎపిఐఐసి ద్వారా కేటాయించాం. వాటిద్వారా ఇప్పటివరకు ఎటువంటి ఉపాధి లభించలేదు.' ఇది సాక్షాత్తు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి టిజి భరత్ శాసనమండలిలో ఇచ్చిన సమాధానం! వైసిపి సభ్యులు అడిగిన ఒక ప్రశ్నకు మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ మేరకు జవాబు ఇచ్చారు. వైసిపి సభ్యులు టి మాధవరావు, వంకా రవీంద్రనాథ్, పండుల రవీంద్రబాబు రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలకు చేసిన భూముల కేటాయింపు, కల్పించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై వివరాలు చెప్పాలని కోరారు. దీనికి జవాబిచ్చిన మంత్రి భరత్ తొలుత రాష్ట్రంలో ఇప్పటి వరకు 3,48,891 మంది ఉపాధి కల్పించామని, ఇందులో మెగా డిఎస్సి ద్వారా 15,941 ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. దీనిని వైసిపి సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము ప్రైవేట్ సంస్థలకు భూములు కేటాయింపులు ద్వారా కల్పించిన ఉద్యోగాలు గురించి అడిగామని, మంత్రి ఇచ్చిన సమాధానానికి ఆ ప్రశ్నకు పొంతన లేదని వారు అన్నారు. దీనికి జవాబుకు ఇచ్చిన అనుబంధం - 2లో 1,46, 890 ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని పొందుపరిచామని మంత్రి భరత్ చెప్పారు. ఆ సమాధానం కూడా తమకు అందలేదని, తాము ఎన్ని ఉద్యోగాలు ఇప్పటిదాకా వచ్చాయో చెప్పాలని అడిగామంటూ వైసిపి సభ్యులు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో కొంత గందరగోళం నెలకొంది. అంతకుముందు వైసిపి సభ్యులు మాధవరావు మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీకి రూ.42వేల కోట్లు, బిపిఎల్ అనే కంపెనీకి రూ.72వేల కోట్లు ప్రోత్సాహకాల రూపంలో ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. కంపెనీలకు కల్పించే ఈ సబ్సిడీని ప్రభుత్వం ఎక్కడి నుంచి తెస్తోందో చెప్పాలన్నారు. లులూ అనేది షాపింగ్ మాల్ అని, ఆ కంపెనీ మలేషియాలో ఇప్పటికే దివాళా తీసిందన్నారు. అలాంటి కంపెనీకి విశాఖ పట్నం, విజయవాడల్లో అత్యంత ఖరీదైన స్థలాలను ఎలా అప్పగిస్తారని నిలదీశారు. ప్రైవేట్ సంస్థలకు భూములు కేటాయించే సమయంలో స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని రోడ్లు, భవనాల శాఖ అధీనంలోని వివిధ ప్రభుత్వ స్థలాల్లో మొత్తం 2,524 అనధికారిక విగ్రహాలు ఏర్పాటు చేశారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు టిడిపి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, బిటి నాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ కడపలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం అనధికారికంగా ఏర్పాటు చేసి సుందరీకరణ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు ఎత్తి అవమానించే విధంగా అధికార పార్టీ సభ్యులు ప్రవర్తిస్తున్నారని నిరసిస్తూ వైసిపి సభ్యులు వాకౌట్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించే అంశంపై చర్చించాలని వైసిపి వాయిదా తీర్మానాన్ని మండలిలో ప్రతిపాదించింది. సభ ప్రారంభం కాగానే వైసిసి సభ్యులు రమేష్ యాదవ్, కె శ్రీనివాస్, బొమ్ము ఇజ్రాయిల్ ఈ తీర్మానం అందించారు. దీనిని ఛైర్మన్ తిరస్కరించారు.

# నక్సల్స్ పాత సిద్ధాంతాన్ని కొనసాగించవద్దు : చంద్రబాబు

**ఒకటి తరువాయి**

చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యంగా వచ్చి, అసెంబ్లీ సమావేశాలు పూర్తికాక ముందే వెళుతున్న ఎమ్మెల్యేలపై చంద్రబాబు మండిపడ్డారు. కీలక చర్చల సమయంలో సభ్యుల గైర్హాజరుపై అసంతఅప్తి వ్యక్తం చేశారు. నేటి సమావేశం ప్రారంభమయ్యే సమయానికి శాసన సభలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని సమాచారం. ఈ మేరకు అసెంబ్లీలో విప్‌లను చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అప్రమత్తం చేశారు. సిఎం చంద్రబాబు ఆరా తీయడంతో.. సమావేశానికి రాని 17 మంది ఎమ్మెల్యేలకు ఫోన్లు చేసి అప్పటికప్పుడు విప్‌లు పిలిపించారు. పూర్తి స్థాయిలో సభ్యులు హాజరయ్యేలా చూడాలని సిఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఇక వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పేరు మార్పుపై అసెంబ్లీలో మంత్రి నారాయణ ప్రతిపాదనలు పెట్టారు. తాడిగడప మున్సిపాలిటీగా పేరు మారుస్తూ మంత్రి నారాయణ తీర్మానం పెట్టారు. సభలో ఎలాంటి వ్యతిరేకత లేకపోవడంతో ప్రతిపాదనను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆమోదించారు.

# సోలార్ విద్యుత్ వినియోగంతో సొమ్ము ఆదా

## కరపత్రాన్ని అందజేస్తున్న ట్రాన్స్‌కో డిఇ శ్రీధర్



**ఆలమూరు ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** సోలార్ విద్యుత్తుతో వినియోగదారుల కు సొమ్ము ఆదా అవుతుందని ట్రాన్స్‌కో మండపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీధర్ అన్నారు. జొన్నాడ స్థానిక చెరువు గట్టు మీద ఉన్న కళ్యాణ మండపంలో గురువారం వినియోగదారులకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించేందుకు కర పత్రాలను ఆయన పంపిణీ చేసి వివరించారు. ఇందులో ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గాలకు చెందినవారు 200 యూనిట్ల లోపు గృహ అవసరాలకు వాడుతున్నట్లయితే వారికి ఉచితంగా సోలార్ విద్యుత్తును కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. వారి యొక్క ఆర్‌సిసి బిల్డింగ్‌పై 200 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని కేటాయి ంచ గలిగితే, వారికి ప్రభుత్వం నెలనెలా రూ.200 అద్దెతో 25 ఏళ్ల పాటు అందజేస్తుందని అన్నారు. అలాగే ఇతర సామాజిక వర్గాల వారి ఇంటికి సోలార్ వేసు కునే విధంగా ప్రభుత్వం రాయితీ కల్పిస్తుం దన్నారు. ఇక్కడ ఒక కిలోవాటు సోలార్ విద్యుత్ ప్యానల్స్‌కి రూ.70 వేలు ఖర్చు అవుతుం దన్నారు. దీనికి రూ.30వేలు రాయితీని, 2 కిలోవాట్ల సోలార్ విద్యుత్ కోసం రూ.1.40 లక్షలు ఖర్చు కాగా, రూ.60 వేలు రాయితీని, ఇలా బహుళ ప్రయో జనాలు ఉన్నాయన్నారు. ప్రతి లబ్ధిదారుడు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియో గదా రులు సోలార్ సిస్టంను ఇంటికి వేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన స్థానిక ప్రజాప్రతి నిధులను కోరారు. ఈ సోలార్ విద్యుత్ పై గ్రామా లలో ప్రజలకు అవగాహన పెంచేందుకు తమ సిబ్బ ందితో ఇంటింటికీ ప్రచారం చేయించి అవగా హన కల్పిస్తున్నామని అన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ట్రాన్స్‌కో కార్యాలయానికి వచ్చి వివరాలు తెలు సుకోవచ్చని డిఇ శ్రీధర్ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, కూటమి నేతలు తాడి శ్రీనివాస్ రెడ్డి, గొడవర్తి బాబి, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, ఎఇ దుర్గాప్రసాద్, ఎల్ఐకెవివిఎస్. నాయు డు, వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# జ్యోతిష్య కళానిధి గా బిరుదును అందుకున్న మామిళ్ళ పల్లి అయ్యప్ప



**గండేపల్లి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** రాజమండ్రిలో జరిగిన విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యం లో జరిగిన జ్యోతిష్య సమ్మేళనం లో రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది వాస్తు,జ్యోతిష్య పండితులతో సభను నిర్వహించారు. వాస్తు,జ్యోతిష్య శాస్త్రాలలో ప్రతిభను కనబరచిన పండితులకు పురస్కా రాలతో పాటు బిరుదును ప్రదానం చేశారు.జగ్గంపేట కు చెందిన ప్రముఖపురోహితులు, వాస్తు, జ్యోతిష్య పండితులు,అర్చక,పురోహిత విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి అయ్యప్ప జ్యోతిష్య,వాస్తు శాస్త్రాల పట్ల వారు చేసిన పరిశోధనలను గుర్తించి వారికి "జ్యోతిష్య కళానిధి" అనే బిరుదును, పురస్కారాన్ని కంచి ఆస్థాన సిద్ధాంతి పంచాంగ కర్త ఎల్ ఎస్ సిద్ధాంతి , పుచ్చా శ్రీనివాసరావు,పాలపర్తి శ్రీకాంత్ , ఇంద్రకంటి గోపాలకృష్ణ శర్మ,మహేంద్ర వంటి ప్రముఖుల చేతులమీదుగా పురస్కారం ప్రధానం చేసారు. ఈ అవార్డ్ రావడం పట్ల అయ్యప్ప కి జగ్గంపేట ఎమ్మెల్యే టిటిడి బోర్డు సభ్యులు, జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

తల్లితండ్రులు,జగ్గంపేట పురోహితులు,గురుస్వామి మామిళ్లపల్లి రామకృష్ణ,రాధాదేవి, ధర్మపత్ని మౌనిక, పిల్లలు ఆశ్రిత్,ఐశ్వర్యలతో పాటు రాష్ట్ర అధ్యక్షులు జ్వాలాపురం శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి పోతవర్జుల పురుషోత్తమ శర్మ, అర్చక,పురోహిత విభాగ అధ్యక్షులు కలసపాటి లక్ష్మీ నారాయణ,జగ్గంపేట మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములకొండ జోగారావు,నియోజకవర్గ అధ్యక్షులు భూపాలపట్నం ప్రసాద్,పట్టణ అధ్యక్షులు గురజాపు సోమ సుందరం,కార్యదర్శి కూచిమంచి రవి,తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# శాసనమండలి ప్యానల్ స్పీకర్ గా సభను నడిపించిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు



**ఆదోని ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆరవ రోజు శాసనమండలి సమావేశాలకు ఎమ్మెల్సీ బీ.టీ.నాయుడు హాజరై ప్యానెల్ స్పీకర్‌గా సభను నడిపించారు. ఆయన కర్నూలు జిల్లా కోసిగి మండలం జుమ్మాలదిన్నె గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. ఆదోనిలో విద్యాభ్యాసం చేసి అంచెలంచెలుగా ఎదిగి న్యాయవాదిగా రాణించారు. ఆ తర్వాత టిడిపి పార్టీలో చేరినప్పటి నుండి పార్టీకి విధేయుడుగా పని చేస్తూ రెండుసార్లు ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి, రెండుసార్లు ఎమ్మెల్సీగా ఎన్నికై, పార్టీలో ఎన్నో పదవులు అనుభవించి, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలను చేపడుతూ ఆదోని నియోజకవర్గం నుండి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్యానల్ స్పీకర్ గా వ్యవహరించి సభను నడిపించిన మొదటి వ్యక్తి గా ఎమ్మెల్సీ బీటీ నాయుడు గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని కష్టపడి పార్టీ కోసం పని చేస్తే పదవులు వాటికి అవే వస్తాయని కార్యకర్తల కష్టాలను గుర్తించి పార్టీలో తగిన ప్రాధానమిచ్చే గొప్ప నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఆదోని నియోజకవర్గంలో సమస్యలపై సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆదోని అభివృద్ధికి నా వంతు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి సూపర్ సిక్స్ సూపర్ హిట్ లో భాగంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు పాటుపడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం చరిత్రలో మరోసారి నిలిచిపోయేలా డీఎస్సీ ద్వారా 16,500 మంది ఉపాధ్యాయులకు అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో రెండుసార్లు శాసనమండలి ప్యానల్ స్పీకర్ గా వ్యవహరించిన ఎమ్మెల్సీ బీటీ నాయుడుపై ప్రజలు టిడిపి కార్యకర్తలు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మాటల వద్దే మహిళా సాధికారత



**అమరావతి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో గురువారం పలుఅంశాలపై పలువురు సభ్యులు అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాలు ప్రారంభమైన అనంతరం రోడ్లు, మహిళా సాధికారిత, ఉపాధి కల్పన, పరిశ్రమలు తదితర అంశాలపై ప్రశ్నలు సంధించారు. ఘంటసాల గ్రామంలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను అభివృద్ధి చేయాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ద ప్రసాదు కోరారు. రాజమండ్రి అర్బన్ శాసనసభ్యులు బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల భవనాలు అభివృద్ధి చేయాలని కోరారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ విద్యాసంస్థలను ప్రభుత్వాలు మారగానే నిలిపేయడం అన్యాయమని అన్నారు. తుని నియోజవకర్గంలో చాలాచోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయని వాటికి రిపేర్లు చేయడం లేదా మరలా నిర్మించడం చేయాలని శాసనసభ్యులు యనమల దివ్య కోరారు. అయితే నెల్లూరు జిల్లా ప్రశ్నకు తుని నియోజవకర్గం నుండి మాట్లాడటం ఏమిటని స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నించారు. దీనిపై ఆర్అండ్బి మంత్రి బి.సి.జనార్థన్‌రెడ్డి స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కుట్టు శిక్షణ నేర్చుకున్న తరువాత మహిళలకు ఉపాధి ఉండటం లేదని, అటువంటి వారికి స్కూల్ యూనిఫామ్స్ కట్టే పని అప్పగించాలని కోరారు. సిఎం నిరంతరం టెక్నాలజీ గురించి మాట్లాడుతున్నారని, మహిళా సాధికారత మాటల వద్దే నిలిచిపోయిందని తెలిపారు. టైలరింగ్ నేర్చుకునే వారికి ఎంబ్రాయిడరీ శిక్షణకు అవకాశం ఉందా లేదా ప్రభుత్వం సమాధానం చెప్పాలని తెలిపారు. అలాగే చాలా శిక్షణా కేంద్రాల్లో టాయిలెట్లు కూడా ఉండటం లేదని వివరించారు. అటువంటి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. డ్వాక్రా సంఘాలను కూడా దోపిడీకి గురవుతున్నాయని, బిజినెస్ కరస్పాండెంట్లు కోటి రూపాయలు దోచుకున్న చరిత్ర ఉందని తెలిపారు. అలాగే చేనేత వృత్తుల ద్వారా శిక్షణ ఇప్పించాలని కోరారు. దీనికి మంత్రి సవిత సమాధానం ఇస్తూ గార్మెంట్ సంస్థలతో మాట్లాడి ఉపాధి కల్పిస్తామని అన్నారు. బబ్బిలి ఎమెల్యే ఆర్‌విఎస్‌కెకె రంగారావు మాట్లాడుతూ పరిశ్రమలకు పవర్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. గ్రోత్ సెంటర్‌కు అవసరమైన భూమిని రైతులు ఇచ్చారని, అయితే వేరే రాష్ట్రాలకు చెందిన వారికి పనులు ఇస్తుండటంతో స్థానికులకు ఉపాధి దొరకడం లేదని అన్నారు. అక్కడ నైపుణ్యశిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి గ్రోత్ సెంటర్‌కు వీలుగా శిక్షణ ఇవ్వాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు సమయంలో ప్రజాభిప్రాయం అనేది లేకుండా చూడాలని ఆయన కోరారు. ఇటువంటి వాటివల్ల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, కనుక ఎస్ఈజెడ్‌లో ఆ సమస్య ఉండదని, అందువల్ల సెజ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. బిజెపి సభ్యులు నడకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన షిప్ బిల్డింగ్ యూనిట్‌ను రాష్ట్రం అందిపుచ్చుకోవాలని అన్నారు.

# తెలుగు రాష్ట్రాలో భారీ వర్షాలు



**అమరావతి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** రానున్న రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు సెప్టెంబర్ 30 వరకు కొనసాగనున్నట్లు ప్రకటించింది. పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలను అధికారులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఇప్పటికే వర్షాలు మొదలయ్యాయి. వచ్చే 5 రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలో పలు ప్రాంతాల్లోను జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉంది. 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం శుక్రవారం నాటికి వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ పేర్కొంది. దీంతో కోస్తాంధ్రలోనూ వర్షాలు మరింత పెరుగుతాయి. నేడు, రేపు, ఎల్లుండు తెలుగు రాష్ట్రాల్లో వానలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఐఎండీ అంచనా ప్రకారం ఉపరితల ఆవర్తనం సెప్టెంబర్ 26న దక్షిణ ఒడిశా, ఉత్తర ఆంధ్ర తీరాలను తాకి వాయుగుండంగా మారనుంది. 27న తీర ప్రాంతాలను దాటే అవకాశం ఉంది. ఈ ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 30వ తేదీ వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని అధికారుల సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గతంలో వరదలు వచ్చిన ప్రాంతాల్లో నివసిస్తున్న వారు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారు అలర్ట్‌గా ఉండాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, వాహనాలు నడిపే విషయంలో జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు.






# అడవి బిడ్డలపై జులుం

**ఏలూరు ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** 'నేవీ ఆయుధ డిపో మాకొద్దు' అంటూ కదంతొక్కిన గిరిజనులపై పోలీసులు విరుచుకుపడడంతో ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం మడకంవారిగూడెంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మడకంవారిగూడెం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ శాంతియుతంగా గిరిజనులు చేపట్టిన ర్యాలీని పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. గిరిజన మహిళలను, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు బలవంతంగా మెడలు పట్టుకుని పక్కకు తోసేశారు. అయినా, పోలీసుల వలయాన్ని ఛేదించుకుని గిరిజనులు ముందుకుసాగారు. వారిని గ్రామశివార్లలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, వందల సంఖ్యలో గ్రామస్తులు అక్కడే బైఠాయించి నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా నినదించారు. కమీషన్ల కోసం ఎంపి, ఎంఎల్ఎ మమ్మల్ని తాకట్టు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని మడకంవారిగూడెం, దాట్లవారిగూడెం, వంకావారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమల వారిగూడెం గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుంది. 1,166 ఎకరాలు సేకరించడంతోపాటు ఆయా గ్రామాలను ఖాళీ చేయించేందుకు సిద్ధమైంది. గతంలో మూడుసార్లు గ్రామసభలో వ్యతిరేకంగా తీర్మానించినా మళ్లీ నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు సిద్ధం కావడాన్ని ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో, ఈ ఐదు గ్రామాల ప్రజలు మడకంవారిగూడెం నుంచి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు శాంతియుత ర్యాలీకి పిలుపునిచ్చారు. వారికి సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. పోలీసులు 30 యాక్ట్ అమలు చేసి తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. పోలీసుల కంటపడకుండా వందలాది మంది గిరిజనులు మడకంవారిగూడెం చేరుకున్నారు. అక్కడి నుంచి వారంతా ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, గిరిజనులకు, పోలీసులకు మధ్య పెద్ద ఎత్తున తోపులాట చోటుచేసుకుంది. గిరిజనులకు మద్దతుగా నిలిచిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవిని పోలీసులు చుట్టుముట్టి పక్కకు తోసేశారు. గిరిజన నాయకులు తెల్లం రామకృష్ణ, ధర్మల రమేష్, తెల్లం దుర్గారావు, మడకం వెంకటేశ్వరరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణతోపాటు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్న గిరిజన మహిళలపై పోలీసులు విరుచుకుపడి ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. దీంతో, వారంతా అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

# 'పిపిపి' ఉపసంహరించాల్సిందే



**అమరావతి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో నిర్మించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని శాసన మండలిలో వైసిపి డిమాండ్ చేసింది. ప్రభుత్వమే ఈ కళాశాలలను నిర్మించి నిర్వహించాలని ఆ పార్టీ ప్రభుత్వాన్ని కోరింది. అయితే ఇందుకు ప్రభుత్వం అంగీకరిం చకపోవ దంతో వైసిపి సభ నుంచి వాకౌట్ చేసింది. అంతకుముందు మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ అంశంపై లఘు చర్చ జరిగింది. చర్చ వాడీవేడిగా కొనసాగింది. టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. తొలుత వైద్య ఆరోగ్య శాఖ పి.సత్యకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిపాదించిన 17 మెడికల్ కళాశాలలను నిర్మాణం, నిర్వహణ మాత్రమే ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. అంతేతప్ప కళాశాలలకు చెందిన భూములు వారికి ఇవ్వడం లేదన్నారు. ప్రైవేటు సంస్థలతో ఒప్పందం 33 ఏళ్లకు ఇస్తున్నామని ఈ గడువును మరో 33 ఏళ్లకు భవిష్యత్తులో పొడిగించే అవకాశం కూడా ఉంటుందని పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబుగా ఆయన వెల్లడించారు. 17 కళాశాలల నిర్మాణానికి రూ.8500 కోట్లు అవసరం అవుతాయన్నారు. గత ప్రభుత్వం రూ. 1550 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఐదు కళాశాలలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగతావి ప్రారంభం కాలేదన్నారు. కళాశాల లను ప్రవేటు వారికి అమ్మేస్తున్నారనే ప్రచారం వాస్తవం కాదన్నారు. 50 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో పేద విద్యార్థులకు దక్కుతాయన్నారు. మంత్రి మాట్లాడుతుండగా వైసిపి సభ్యుడు రహుల్లా మంత్రి సోది చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఇందుకు టిడిపి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టిడిపి సభ్యులు పోడియం వద్దకు వెళ్లి రహుల్లా మంత్రికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రహుల్లా మాట్లాడిన పదాలు అన్‌పార్లమెంటరీ కనుక అయితే రికార్డులను పరిశీలించి తొలగిస్తామన్నారు. ఈ సందర్భంగా వైసిపి సభ్యులు కుంభారవిబాబు, పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి, కల్పలతా, రమేష్‌బాబు, సిపాయి సుబ్రమణ్యం, తూమాటి మాధవరావు, ఇస్రాయిల్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయంలో 17 కళాశాలలను ఒకే సారి ప్రారంభించామని వీటిలో ఐదు పూర్తయ్యాయని తెలిపారు. రూ.లక్ష కోట్లు పెట్టి రాజధాని నిర్మించే కూటమి ప్రభుత్వం వద్ద మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ. 5 వేల కోట్లు లేవా అని ప్రశ్నించారు. 17 మెడికల్ కళాశాలలకు ఒకే సారి 2,550 సీట్లు రాష్ట్రానికి కేటాయించారని గుర్తు చేశారు. కరోనా తరువాత కేంద్రప్రభుత్వం దేశ వ్యాప్తంగా మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు కాకుండా ప్రభుత్వం అధీనరలో ఉండాలన్న లక్ష్యంతో ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాలను కేటాయించిందని గుర్తు చేశారు. ఇందుకు విరుద్ధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, బిజెపి మంత్రి సత్యకుమార్ మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి సభ్యులు పంచుమర్తి అనురాధా, వేపాడ చిరంజీవి రావు, కావలి గీష్మ, రాంభూపాల్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ 17 కళాశాలల నిర్మాణంను ఆర్భాటంగా ప్రారంభించి కేవలం మూడు మాత్రమే పూర్తి చేశారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రవేటు సంస్థలే ఈ నిర్మాణాలను పూర్తి చేసి పేదలకు 50 శాతం సీట్లు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సబబేనన్నారు. ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మాణం చేపట్టామని 5 పూర్తయ్యాయని మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. తరువాత వచ్చిన ప్రభుత్వం వీటిని త్వరగా పూర్తి చేయాలే తప్ప ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనుకోవడం అన్యాయం అన్నారు. ప్రజారోగ్యం ప్రైవేటు పరం చేస్తే ఎన్నో ఘోరాలు జరుగుతాయన్నారు. ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడు సిఎం అయినా కీలక రంగాలన్నింటిలో ప్రైవేటు సంస్థలకు భాగస్వామ్యం కల్పిస్తారని ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తారని ఆరోపించారు. పిపిపి విధానం ఎన్నో సార్లు విఫలం అయిందని తెలిపారు. ప్రతిసారి పిపిపి అనడం సబబు కాదన్నారు. ప్రజారోగ్యాన్ని ప్రైవేటు పరం చేయడం అన్యాయం, దుర్మారం అంటూ మండలి నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించారు. పలుమార్లు మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారధితో బొత్సాకు వాగ్వాదం జరిగింది.

# ఘనంగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు



**కాకినాడ ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** దేశం కోసం, ధర్మం కోసం వ్యక్తి నిర్మాణమే లక్ష్యంగా ఏకాత్మ మానవతావాదం అనే సిద్ధాంతంతో జీవితం గడిపి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడు లో మండల ప్రధాన కార్యదర్శి పాలిక శివ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంభాల వెంకటేశ్వరరావు ,కిసాన్ మోర్చా నాయకులు బొలిశెట్టి వెంకట రామకృష్ణ పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలను వేసి ఘన నివాళులర్పించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకాత్మ మానవతా వాదంతో దేశ ప్రజలలో చైతన్యం తీసుకువచ్చిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన జన సంఘ్ పార్టీకి ప్రధాన భూమిక పోషిస్తూ అధ్యక్షులుగా ఆయన చివరి జీవితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వారణాసి మొఘల్ సరాయ్ స్టేషన్లో అనుమానాస్పద మృతిగా చిత్రీ కరించడం జరిగిం దని అన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు భారత దేశం వైపు ఆకర్షించే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన సాధించడానికి ప్రధాన మూల సిద్ధాంతం ఆయనేనని రంబాల అన్నారు .పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ శ్రేణులు గైగోలుపాడు విష్ణు ఆలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులను కోరారు. కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు బందరు అజయ్, కండిలి వెంకట్ , లావరాజు ,వీరబాబు, భద్రం తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సమస్యలపై స్పందించిన డిప్యూటీ సీఎం

## - పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపిన మల్లాడి రాజేంద్ర

**కాకినాడ ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :**ఉప్పాడ మత్స్యకారుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి, వాటిని పరిష్కరించే దిశగా కమిటీని నియమించడం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు కాకినాడ సిటీ జనసేన నాయకులు, మల్లాడి రామారావు మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా. మల్లాడి రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న తీర ప్రాంతంలో మత్స్యకారుల సమస్య పై ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్పందించి కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో ప్రత్యేక చొరవ చూపించారనీ అన్నారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ , స్థానిక మత్స్యకారులతో కలిపి కమిటీని ఏర్పాటు చేయడం మంచి పరిణామం అని అన్నారు. గతంలో పలు సార్లు పవన్ కళ్యాణ్ స్వయంగా ఉప్పాడలో మత్స్యకారులను కలిసి వారి కష్టాలను తెలుసుకున్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈ సమస్యలపై చర్చించారు. దీని ఫలితంగానే ప్రభుత్వం కమిటీని నియమించడం హర్షణీయం అని మల్లాడి తెలిపారు. ఈ కమిటీ మత్స్యకారుల సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, వాటికి శాశ్వత పరిష్కారాలు సూచించాలని, ప్రభుత్వం ఆ సూచనలను వెంటనే అమలు చేసే దిశగా యంత్రాంగం పనిచేయాలని ఆయన కోరారు. మరణించిన 18 మంది మత్స్యకార కుటుంబాలకు కూడా మేలు జరిగేలా కూటమి ప్రభుత్వం తప్పక చర్యలు తీసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# భూముల రక్షణకు ఐక్య పోరాటాలు



**అమరావతి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** పేదల భూములను పరిశ్రమల పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని ఐక్య పోరాటాలతో అడ్డుకుని, భూములను కాపాడుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతు, కూలీల మహాధర్నా విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి అంటే పచ్చని భూములను కార్పొరేట్లకు కట్టుబెట్టడం కాదన్నారు. భూములు ఇచ్చిన రైతులకు ఉపాధి, ఆదాయం కల్పించడంతోపాటు, జీవితాలు గతం కంటే మెరుగుపడాలన్నారు. రాష్ట్రంలో భూములు ఇచ్చిన రైతులకు ఎక్కడా ఇటువంటి పరిస్థితి లేదన్నారు. గత 10 ఏళ్లలో ఎపిఐఐసి 1.45 లక్షల ఎకరాలను పరిశ్రమలకు కేటాయించిందని, ఎన్ని చోట్ల పరిశ్రమలు పెట్టారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అదానీ, అంబాని, నవయుగ, షిర్డిసాయి వంటి సంస్థలకు భూములను దారాదత్తం చేస్తుందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ ఉండగా, శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కార్గోకు 4 వేల ఎకరాల్లో ప్రత్యేక ఎయిర్ పోర్టు ఎందుకని ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లాలో గతంలో బల్క్ డ్రగ్ పరిశ్రమ కోసం ఇచ్చిన భూములను మిట్టల్ స్టీల్‌కు కేటాయించి, తాజాగా మళ్లీ బల్క్ డ్రగ్ పరిశ్రమకు భూములు సేకరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఉన్న బల్క్ డ్రగ్ పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం వల్ల అక్కడి ప్రజలు అనారోగ్య సమస్యల భారిన పడుతున్నారన్నారు. కాకినాడ సెజ్‌కు 10వేల ఎకరాలు తీసుకుంటే కేవలం 150 ఎకరాల్లో మాత్రమే ఒక పరిశ్రమ ఏర్పాటు చేశారని చెప్పారు. సత్యసాయి జిల్లాలోని నాలెడ్జ్ సెంటర్ కోసం సేకరించిన 4 వేల ఎకరాల్లో నిర్మాణ సంస్థ 2,500 ఎకరాలను తనఖాపెట్టి బ్యాంక్ నుంచి రూ.4,500 కోట్లు రుణం తీసుకుందన్నారు. వీరిపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో 40 వేల ఎకరాలను సేకరిస్తున్నారని తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్‌లకు భూములు ఇచ్చిన రైతులకు లాభాల్లో వాటా ఇవ్వాలన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని తప్పుబట్టారు. పిపిపి అంటే పబ్లిక్ ప్రాపర్టీపై ప్రైవేటు పెత్తనమని చెప్పారు. విశాఖలో డేటా సెంటర్‌కు అదానికి 4 ఏళ్ల కిందట భూములిస్తే ఇప్పటికీ ఏర్పాటు చేయలేదన్నారు. ఆ సంస్థ నుంచి భూములు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిసిఎస్ సంస్థకు ఉచితంగా భూములు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఏర్పాటైన ఒకటి రెండు పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, బీహార్, బెంగాల్ రాష్ట్రాల తీసుకువచ్చిన వారితో పనులు చేయించుకుంటున్నారని చెప్పారు. శ్రీశైలం, సోమశిల, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల నిర్వాసితులకు ఇప్పటికీ పునరావాసం కల్పించలేదని చెప్పారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేదల భూముల్ని బలవంతంగా లాక్కుంటుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. మాజీ సిఎం జగన్‌కు 2 వేల ఎకరాల భూమి ఉందని, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీ లకు వందల ఎకరాల్లో భూములు న్నాయని, వారి భూములను ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిచారు. ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహారాష్ట్రలో ఎఐకెఎస్ చేసిన పోరాటం తరహాలో రాష్ట్రంలో కూడా పోరాటం చేయాలన్నారు. కనీసం ఇద్దరు వామపక్ష పార్టీ నాయకులనైనా అసెంబ్లీకి పంపి ఉంటే ప్రజల సమస్యలు ప్రస్తావనకు వచ్చి ఉండేవన్నారు. ఎఐఎడబ్ల్యుయు కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ.. రైతులు చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. పోరాట కేంద్రాలను తమ ఎంపీలతో కలిసి సందర్శించనున్నట్లు తెలిపారు. రైతు సంఘం నాయకులు బి.బలరామ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం భూ సంస్కరణలను అమలు చేయడం లేదన్నారు.

జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులు, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల ప్రకారం పేదలకు భూములు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బరావు అధ్యక్షత వహించారు. మహాధర్నా సందర్భంగా భూసేకరణ బాధిత రైతులు, నాయకులు అసెంబ్లీకి వెళ్లేందుకు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను తప్పించుకుని లెనిన్ సెంటర్, అప్సర సెంటర్ మీదుగా 5వ నెంబరు రూట్‌లోకి ర్యాలీగా వెళ్లి ఆంధ్రా ఆసుపత్రి కూడలి వద్ద నిరసన తెలిపారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వై.కేశవరావు, ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అమలు చేయాలి : సిఐటియు




**కాకినాడ ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలను వర్తింప చేయాలని సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో మంత్రి లోకేష్ చేసిన ప్రకటన ఆధారంగా మున్సిపల్ అవుట్ సోర్సింగ్, శానిటేషన్ వర్కర్స్‌కి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు. జిఒ నెం 26 పేజీ 4లో పేరా జిలో ఉన్నట్లుగా శానిటేషన్ వర్కర్స్‌కి, గ్రామీణ ప్రాంతాలలో రూ.10 వేల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు లోపు జీతం కలిగిన వారికి తల్లికి వందనం అమలు చేయవచ్చని ఉందన్నారు. దీనిపై కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మున్సిపల్ కమిషనర్లకు లేఖ రాశారని గుర్తు చేశారు. అయితే కాకినాడ నగర పాలక సంస్థ అధికారులు వర్తించదని చెప్పారని, కలెక్టర్ సైతం రూ.12 వేలు లోపు జీతం కలిగిన వారికి తల్లికి వందనం వర్తిస్తుందని చెప్పారన్నారు. మంగళవారం శాసనమండలిలో మంత్రి లోకేష్ జీతంతో నిమిత్తం లేకుండా శానిటేషన్ వర్కర్స్‌కి తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్ విషయంలో మంత్రివర్గం చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారన్నారు. కావున మంత్రి లోకేష్ ప్రకటన ప్రకారం కలెక్టర్ జోక్యం చేసుకుని మున్సిపల్ అవుట్ సోర్సింగ్ శానిటేషన్ వర్కర్స్‌కి తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

## జనాభాపై కాకి లెక్కలు ఒక్కో శాఖది ఒక్కో లెక్క!



**అమరావతి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** రాష్ట్ర జనాభా ఎంతన్నది స్పష్టంగా తేలని పరిస్థితి. ఒక్కో శాఖ ఒక్కో గణాంకాలతో ముందుకొస్తుండడంతో గందరగోళంగా మారుతోంది.ఎ. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా నిర్వహించిన సర్వేలో ఒక లెక్క కనిపిస్తుండగా, ఉడాయ్ గణాంకాల్లో ఒకలా, ఆధార్ లెక్కల్లో ఇంకొకలా, ప్రణాళిక శాఖ అధికారిక గణాంకాల్లో ఇంకొకమాదిరిగా జనాభా కనిపిస్తోంది. అయితే, ఎన్ని గణాంకాలు మారినా కూడా రాష్ట్ర జనాభా ఐదు కోట్లకు పైగానే ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఏ పథకాన్ని అమలు చేయాలన్నా కూడా వాస్తవంగా ఎంత జనాభా ఉందన్నది విస్పష్టంగా తేలాల్సి ఉంటుంది. అందులో భాగంగానే ఏ వర్గానికి ఏయే పథకాలు ఇస్తున్నామన్న లెక్కలను కూడా తేలుస్తారు. ప్రధానంగా జనాభా లెక్కలు తేల్చేంపదుకు పదేళ్లకు ఒకసారి నిర్వహించే జనగణన కీలకం కాగా మధ్యలో భిన్న సర్వేల ద్వారా లెక్కలు గుర్తిస్తారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ద్వారా ఒక్కో కుటుంబంలో ఎంత మంది నమోదై ఉన్నారన్న లెక్కలు ఖరారు చేస్తారు. అలాగే ప్రణాళిక శాఖ, ఆధార్ వంటి ఇతర విభాగాల ద్వారా కూడా జనాభాపై లెక్కలను గుర్తిస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 4.95 కోట్లమంది జనాభా ఉన్నట్లు తేల్చారు. కాగా రేషన్ కార్డుల సర్వే ఆధారంగా రాష్ట్రంలో మొత్తం 1.71 కోట్ల కుటుంబాలు ఉండగా, అందులో 1.47 కోట్ల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. అంటే మొత్తం 1.71 కోట్ల కుటుంబాల్లో కుటుంబానికి సగటున మూడు నుంచి నలుగురు ఉంటారని భావించినా దాదాపు 5.15 కోట్ల మంది జనాభా ఉంటారని అంచనా వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. తాజాగా నెల రోజులపాటు నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ఎంత మంది ఉన్నారు. వారిలో ఎంతమంది యోగా కార్యక్రమానికి హాజరయ్యారన్నదానిపై గ్రామ, వార్డు సచివాయలాల ద్వారా నిర్వహించిన ఒక సర్వేలో 5.11 కోట్ల మంది జనాభా ఉన్నట్లు పేర్కొనడం విశేషం. కేంద్రం నిర్వహించిన ఉడాయ్ (యూనిక్ ఐడెంటిఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా) కార్యక్రమం మేరకు రాష్ట్రంలో 5.35 కోట్ల మంది జనాభా ఉన్నట్లు తేల్చారు. అదే రాష్ట్రంలో పలు కార్యక్రమాల అమలు కోసం చేసిన ఆధార్ సర్వే మేరకు 5.74 కూట్ల మంది ఉన్నట్లు తేలింది.

## డిజిటల్ అరెస్టు పేరుతో రూ.51 లక్షలు అపహరణ



**ఏలూరు ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. వృద్ధ మహిళను డిజిటల్ అరెస్టు పేరుతో మోసం చేసి ఆమె వద్ద నుంచి రూ.51 లక్షలు అపహరించారు. ఈ ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు ఆర్ఆర్.పేట ప్రాంతానికి చెందిన వృద్ధురాలు మేక రమాదేవి భర్తతో కలిసి జీవిస్తుంది. వీరి పిల్లలు విదేశాల్లో స్థిరపడ్డారు. రమాదేవి కూడా గ్రీన్ కార్డ్ హోల్డర్‌గా ఉన్నారు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఆమెకు ఫోన్ చేసి మీ ఆధార్ నెంబర్‌పై సిమ్ కొనుగోలు చేసి అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. అనంతరం వీడియో కాల్‌లో ఎస్ఐ దుస్తుల్లో ఉన్న ఒక వ్యక్తి తాను బెంగళూరుకు చెందిన పోలీసు అధికారినని, మీపై ముంబై ప్రాంతంలో బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, వాటి ద్వారా నేరస్తులకు నగదు బదిలీ అయిందని, మీపై కేసులు నమోదయ్యాయని బెదిరింపులకు గురిచేశాడు. వాటికి సంబంధించిన నకిలీ పత్రాలను కూడా వాట్సాప్ ద్వారా ఆమెకు షేర్ చేశాడు. అంతటితో ఆగకుండా నకిలీ అరెస్టు పత్రాలను కూడా ఆమెకు పంపారు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని తెలిపారు. దీంతో రమాదేవి భయభ్రాంతులకు గురై వెంటనే ఆ కేసు నుంచి బయట పడేయమని వారిని కోరారు. అందుకు దఫాదఫాలుగా రూ.51 లక్షలు వారికి చెల్లించారు. చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు రెండో పట్టణ సిఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాత్యాయనిదేవి' గా వాసవి మాత దర్శనం

**అంబాజీపేట ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా స్థానిక బస్ స్టేషన్ వద్ద వేంచేసి ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు 'కాత్యాయనీ దేవి' అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో చంద్రమౌళి ధనుష్, కామేష్ శర్మలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కాసు శ్రీనివాసరావు, గోకవరపు శివ, అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. మాచవరం శివారు కోటివారి వారి అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.స్థానిక పశువుల సంత ఆవరణలో ఉన్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు సమకూర్చిన అన్న ప్రసాదంను వితరణ చేశారు. అలాగే స్థానిక పెద వీధిలోని శ్యా మలా నగర్‌లో శ్రీ వీణా శ్యామ లాంబసమేత చంద్రశేఖర స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

## సాగుకు ఆటంకం లేకుండా చర్యలు

**అంబాజీపేట ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** పంట కాలువలు, డ్రెయినేజీల ప్రక్షాళన చేసి సాగుకు ఆటంకం లేకుండా పాలకవర్గం చర్యలు చేపట్టాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. మాచవరం (అంబాజీపేట)కు చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావ్న రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్‌గా విజయవాడ జల వనరుల నిర్వహణ కార్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుభాష్ విచ్చేశారు. ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రయోజనాల కోసం పాలకవర్గం కషి చేయాలని సూచించారు. రాష్ట్ర అటవీ శాఖ ఐటి ప్రాజెక్టు సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు మాట్లాడుతూ పంట కాలువలు, జల కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకుని శివారు ప్రాంత భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా పాలకవర్గం కషి చేయాలని సూచించారు. రాష్ట్ర డైరెక్టర్ పదవీ ప్రమాణ స్వీకారం చేసిన వెంకటేశ్వరరావుకి రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, టిడిపి నియోజకవర్గ కో-కన్వీనర్ డివివి.సత్యనారాయణ, నగరం ఎఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, అంబాజీపేట పిఎసిఎస్ ఛైర్మన్ జనసేన అరిగెల సూరిబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దా చంటి, టిడిపి మండల అధ్యక్షులు గూడాల ఫణి,డి.సాయి కష్ణ, కొర్లపాటి గోపి, పి.గన్నవరం ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, వాసంశెట్టి కుమార్, సుంకర గణపతిరావు, రవణం రాము, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం విజయారావు, కూటమి నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

# మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి




**మండపేట ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. గురువారం మండపేట టౌన్ హాల్ 23, 24వార్డులలో స్వస్థనారీ స్వశక్త్ అభియాన్ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ భవాని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు ప్రతి కుటుంబంలో మహిళ పాత్ర చాలా ముఖ్యమైనదని 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు మహిళలు స్క్రీనింగ్ టెస్ట్ లు చేయించుకోవాలన్నారు. దానివల్ల ఏదైనా ప్రమాదకరమైన సమస్య ఉంటే ముందుగానే వైద్యం చేసుకుని ఆరోగ్యంగా ఉండొచ్చని రాణి తెలిపారు. పి.ఎం.పి వైద్యులు కోన సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక రోగులకు టీబీ, హెచ్ఐవి రోగులకు మందులు ఉచితంగా ప్రభుత్వ ఇస్తుందని, ప్రతిఒక్కరూ డెలివరీలు ప్రబుత్వ ఆసుపత్రిలో పోసుకోవాలని అంగన్ వాడీ లద్వారా బలమైన పౌష్టికాహారం ఇస్తున్నారని తల్లిబిడ్డలకు వాక్సిన్ వేస్తున్నారని ఆబా కార్డులు చేయించుకోవాలని 5 లక్షలవరకు ఉచిత భీమావైద్యం పొందవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డుఇంచార్జ్ లు బొడ్డురామకృష్ణ, ముక్కా దాలయ్య, జొన్నపల్లి సత్తి బాబు, కాళ్ల ఆనంద్ ఆశావర్కర్లు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# కాలుష్యంపై మత్స్యకారుల కన్నెర్ర

**కాకినాడ ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** ఫార్మా కంపెనీలు, ఇతర పారిశ్రామిక సంస్థల మూలంగా మత్స్య సంపద అంతరించి పోతోందని మత్స్యకారులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనోపాధిని కోల్పోతున్నామంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో మత్స్యకారులు గత రెండు రోజుల నుంచి ఆందోళన తీవ్రతరం చేశారు. ఫార్మా కంపెనీల కాలుష్యంతో తమ మనుగడకే ముప్పు ఏర్పడుతోందని గళమెత్తుతున్నారు. మత్స్యకారుల ఆందోళనతో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి మత్స్యకారుల సమక్షంలో బుధవారం చదివి వినిపించారు. దీంతో మత్స్యకారులు తాత్కాలికంగా ఆందోళనను విరమించినట్లు ప్రకటించారు. అక్టోబర్ 10వ తేదీలోగా సమస్యకు పరిష్కరించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని మత్స్యకారులు హెచ్చరించారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో మంగళవారం మొదలైన ఈ ఉద్యమం బుధవారం మూలపేట, పొన్నాడ, కోనపాపపేటలలో ఎక్కడికక్కడ మత్స్యకారులు రోడ్ల మీద తిష్ట వేశారు. వేలాదిమంది పాల్గొని రోడ్డుపై రాకపోకలను అడ్డుకుంటున్నారు. దీంతో కాకినాడ, తుని మధ్యలో ఉన్న బీచ్ రోడ్ ప్రస్తుతం పూర్తిగా స్తంభించిపోయింది. ఆందోళనకారులు రోడ్ల మీదే వంటావార్పు కార్యకలాపాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుని తీవ్రంగా తప్పుపట్టారు. దివిస్, అరబిందో లాంటి ఫార్మా కంపెనీల కారణంగా వాటి నుంచి వస్తున్న కాలుష్యం మూలంగా మత్స్య సంపద పూర్తిగా నాశనం అయపోతుందని, వేటకు వెళ్ళినా ఒట్టి చేతులతో వెనక్కి రావాల్సి వస్తుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీల కార్యకపాల్లో భాగంగా వాటి నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి వదిలేందుకు యు.కొత్తపల్లి మండలంలో కోనపాపపేట, తొండంగి మండలం పెరుమాళ్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల పొడవున భారీ పైపులైన్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఫార్మా వ్యర్థాలు, రసాయనాలతో కూడిన విషపూరిత జలాలను సముద్రంలోకి నేరుగా విడుదల చేస్తున్నాయని స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. దీంతో సంప్రదాయ మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని మత్స్యకారుల ప్రధాన ఆరోపణ. అయితే ఈ ఆందోళన ఎప్పటికీ పూర్తవుతుంది. వారి సమస్యకు పరిష్కారం లభిస్తుందా లేదా..,ప్రభుత్వ స్పందిస్తుందా అనేది ప్రస్తుతానికి స్పష్టత లేదు.డిప్యూటీ సిఎంపై పెరుగుతున్న ఒత్తిడిఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై మత్స్యకారులు రోజురోజుకీ ఒత్తిడి పెంచుతున్నారు. గత రెండు రోజులుగా తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ విషయంపై అధికారులు సైతం మల్లుగుల్లాలు పడ్డారు. పవన్‌కల్యాణ్ వచ్చి తమ సమస్యలను పరిష్కరించాల్సిందే అంటూ ఆందోళన కొనసాగించారు. వారిని శాంతిపజేయడం కోసం అధికారులు చర్చలు జరిపారు. వాస్త వానికి ఎన్నికల సమయంలో పవన్ ఇక్కడికి వచ్చి వారాహి మీటింగ్ పెట్టి కాలుష్య పరిశ్రమలను నిలుపివేస్తాం అంటూ హామి ఇచ్చారు. సమస్య పరిష్కారానికి తాను బాధ్యత తీసుకుంటానని చెప్పి ఇప్పుడు తప్పించుకోవడం సరికాదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదంటూ మండిపడుతున్నారు. దీంతో అధికారులు నచ్చజెప్పే



ప్రయత్నాలు సాగిస్తున్నా ససే మీరా అంటు న్నారు. పవన్ రావాలి, తమ గోడు వినాలి, సమస్య పరిష్కరించాలి అంటూ నినాదాలు చేస్తున్నారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎఎస్‌పి దేవరాజ్ మనీష్ పాటిల్, కాకినాడ ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు ఆందోళనకారులతో చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. తమ సమస్యలను పరిష్కరించాల్సిందే అంటూ పట్టు బట్టారు. కొన్ని హామీలు ఇచ్చినా మత్స్యకారులు సంతృప్తి చెందలేదు. తన సొంత నియోజకవర్గంలో వేలాది మంది రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న తరుణంలో డిసిఎం ఒత్తిడికి గురవుతున్నారని తెలుస్తోంది. వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండడమే కాకుండా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో జ్వరంతోనే హాజరవుతున్నారని ఆయన కార్యా లయం రెండు రోజుల క్రితం ప్రకటించింది. మరోవైపు ఈ ఆందోళనపై ఆయన సిబ్బంది జిల్లా యంత్రాంగంతో చర్చలు జరుపుతున్నారు.అధికారులు, స్థానికులతో కమిటీమత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు, మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులతో కమిటీ వేసి అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యల్నీ గుర్తించామని బుధవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో డిసిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. ప్రస్తుతం శాసనసభ సమావేశాల కారణంగా వ్యక్తిగతంగా వచ్చి మత్స్యకారులతో నేరుగా చర్చించలేకపోతున్నానని, వారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చిస్తున్నానని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీష్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ కలెక్టర్‌తో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇందులో మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులకు స్థానం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ కమిటీ మత్స్యకారుల సమస్యలను అధ్యయనం చేసి, అమలు చేయదగిన సిఫారసులతో కూడిన నివేదికను సిద్ధం చేస్తుందన్నారు. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన ప్రకటించారు. ఇదే విషయాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బుధవారం సాయంత్రం మత్స్యకార నాయకత్వంతో చర్చించారు. పవన్‌కల్యాణ్ ఇచ్చిన లేఖను మత్స్యకారుల మధ్య కలెక్టర్ చదివి వినిపించారు. దీంతో మత్స్యకారులు తమ ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, అక్టోబర్ 10వ తేదీలోగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకపోతే మరోసారి ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరికలు జారీ చేశారు. తాత్కాలికంగా ఉద్యమం వాయిదా పడటంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

## ఆదిత్య లో ఘనంగా వరల్డ్ ఫార్మసిస్ట్స్ డే వేడుకలు



**గండేపల్లి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి కళాశాలల్లో వరల్డ్ ఫార్మసిస్ట్స్ డే వేడు కలు ఘనంగా నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలి పారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధి గా విచ్చేసిన కాకినాడ అర్బన్ డ్రగ్ ఇన్స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానా తన ప్రసంగంలో డ్రగ్ ఇన్స్పెక్టర్ కావడానికి పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి,ప్రభుత్వ రంగంలో లభించే వివిధ ఉద్యోగ అవకాశాలు గురించి విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు ప్రశ్నలు అడిగి, విలువైన విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సెమిస్టర్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పథకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

అవసరమైన వారికి పోషకాహార పదార్థాలు పంపిణీ చేశారు.ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి నందు జరిగిన కార్యక్రమంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ లో ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ ఛాలెంజెస్ హౌట్రెండ్స్ అండ్ ఫ్యూచర్ డైరెక్షన్స్ అనే అంశం మీద అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవి శంకర్‌హౌతెలిపారు.ఈ కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ డాక్టర్ డి. సతీష్ కుమార్,ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ కో - ఆర్డినేటర్ శ్వేత,డాక్టర్ మాధవి లత, డాక్టర్ వైదేహి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ పథకం



**ఆత్రేయపురం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల ఆరోగ్య సంరక్షణ కొరకు ఏర్పాటు చేసిన స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్విని యోగపరుచుకోవాలని వైద్యాధికారి హైమ శ్రీ, అన్నారు. మండలంలోని వసంతవాడ ఆర్ బి కే సెంటర్ నందు ఐసిడిఎసి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు, సొసైటీ అధ్యక్షులు దండు సీతారామరాజు, బైర్రాజు బంగార్రాజు,లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హైమశ్రీ మహిళలకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమై న మహిళలు బలమైన కుటుంబాలు స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ పథకం కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమంలో మహిళల ఆరోగ్య సమస్యలు రక్తపోటు, మధుమేహం వంటి వాటికి వైద్య పరీక్షలు నిర్వహించి, రొమ్ము, నోటి, గర్భాశయ కాన్సర్ వంటి వాటికి స్క్రీనింగ్, మానసిక వ్యాధులకు కౌన్సిలింగ్ క్షయ వ్యాధులకు పరీక్షలు చికిత్స వయోవృద్ధులు కిషోర బాలికలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తా మన్నారు. ముఖ్యంగా మహిళలకు పోషకాహారం గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పు తామంటూ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయ కులు ,శాంతి ప్రియ, దేవి, రామచం ద్రం, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది , ఏఎన్ఎం,లు, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : ఐద్వా పిలుపు

**అమరావతి ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభలు అనంతపురం జిల్లాలో అక్టోబరు 13 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘం చేసిన కార్యక్రమాల అనుభవాలను చర్చించుకుని, రాబోయే కాలంలో కర్తవ్యాలను రూపొందించుకోనున్నట్లు తెలిపారు. ప్రజలు గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలన ఇస్తామని నమ్మి కూటమిని గెలిపిస్తే, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ విధానాల పట్ల మహిళలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్న వాగ్దానం గురించి ప్రభుత్వ పెద్దలు మాట్లాడటం లేదని, ఉచిత గ్యాస్ సిలిండర్ల వాగ్దానం నామమాత్రంగా అమలు జరుగుతుందన్నారు. ఉచిత బస్సు హామీ అమలును స్వాగతిస్తున్నామని, బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు ఈ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. జనాభాను బట్టి బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. డ్వాక్రా పథకంలో రూ.10 లక్షల రుణాలకు సున్నా వడ్డీ హామీ నేటికీ అమలు కాలేదన్నారు. హింసకు కారణమైన మద్యం పాలసీ విధానంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం లాభార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయని, ఇది మహిళలకు నష్టదాయకమని తెలిపారు. నివాస ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం షాపుల్ని ఏర్పాటు చేయడం, ఎమ్మెల్యేలు మద్యం వ్యాపారంలో భాగస్వాములుగా ఉండటంతో రాష్ట్ర మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే బెల్ట్ షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. మద్యం వినియోగంపై టార్గెట్‌లు ఇవ్వడమంటే యువత జీవితాలతో ఆడుకోవడమేనన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తున్నారని చెప్పారు. ఈ అంశాలన్నింటిపై మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. ఆహ్వానం సంఘం ప్రధాన కార్యదర్శి వి సావిత్రి మాట్లాడుతూ.. మహాసభల సందర్భంగా అక్టోబరు 9 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, మహిళా ఉద్యమ చరిత్రపై ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, ఆఫీస్ బేరర్స్ శ్రీదేవి, అలివేలు, సత్యవతి, రమణి తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి క్షేత్రంలో భవాని భక్తులు సందడి

**ఆత్రేయపురం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** ఏడువారాల వేంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం గురువారం భవాని భక్తులతో సందడి నెలకొంది.ఏడువారాల నోముఆచరించే భక్తులు, ఏడువారాలు నోము పూర్తి అయిన భక్తులు,భవాని భక్తులు రాకతో ఆలయ పరిసరాలు గోవింద నామ స్మరణతో మర్మోగాయి.ఉదయం మేలుకొలుపు, లక్ష్మి ఐశ్వర్య హెూమం, గోపూజ, వసంత మండపం లో నిర్వహించిన అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, బాలభోగం, నివేదన, పవళింపు సేవ, తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు.. వేలాది మంది భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకుని దర్శించుకుని వారి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి దర్శనం అనంతరం భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు. వివిధ సేవల ద్వారా శ్రీ స్వామివారికి రూ. 7,27,906 లు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.ముమ్మిడివరం మండలానికి, చెందిన బాలాజీ కాన్వెంట్ , పరసరాముని వెంకట సీత రామ శాస్త్రి సుజాత దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,116లు శ్రీ స్వామి వారి నిత్యా అన్నదాన పథకానికి విరాళంగా అందించారు.

# రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పుల్లేటికుర్రు విద్యార్థులు

**అంబాజీపేట ,( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్, ఖో-ఖో, వాలీబాల్,అథ్లెటిక్స్ పోటీలకు పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. వెంకటరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో భాగంగా ఈనెల 22,24 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో బాల్ బ్యాడ్మింటన్ లో సిహెచ్. జ్యోతి సాయి పల్లవి, ఎ.రష్మిత, వాలీబాల్ లో జి.రమా అక్షితలు ఎంపికయ్యారన్నారు. అలాగే అథ్లెటిక్స్ లో భాగంగా 1500 మీటర్ల పరుగు పోటీలో సిహెచ్. హర్షవర్ధిని ప్రథమ స్థానం, మూడు ,నాలుగు కి.మీ పరుగు పోటీలో ఎం.తేజస్విని దుర్గా శ్రీ, మద్రి తేజస్వ లు ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక య్యారని తెలిపారు. జూనియర్ అథ్లెటిక్స్ లో పాల్గొన్న కొప్పిశెట్టి మనోజ్ విశేష ప్రతిభ కనబర్చి ట్రయా థ్లిన్ పోటీలకు ఎంపికయ్యా డన్నారు. మద్రి తేజస్వ, సిహెచ్ .హర్షవర్ధని లు ఖో-ఖో పోటీలకు కూడా ఎంపిక కావడం విశేషం. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వారికి తర్ఫీదునిచ్చిన వ్యాయా మోపా ధ్యాయులు అందే సూర్యనారాయణ, దొమ్మేటి ఉదయ భాస్కర్లను హెచ్ఎం వెంకట్రావుతో పాటు గ్రామ సర్పంచి జల్లి బాలరాజు, ఎస్ఎంసి చైర్ పర్సన్ నూకల శ్రీ రత్నమాల, స్టాఫ్ సెక్రటరీ జి.వి .రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.




# చైర్మన్ ఎన్నికపట్ల ఎమ్మెల్యే బండారు కృషి కి అభినందనలు తెలిపిన తెలుగు యువత

**ఆత్రేయపురం ( మనసులో మాట ) , సెప్టెంబర్ 25 :** ప్రముఖ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన చైర్మన్‌గా ఇటీవల నియమితులైన ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్)ను ఆత్రేయపురం మండల తెలుగు యువత అధ్యక్షుడు వెత్స అనిల్ కుమార్, కొత్తపేట నియోజకవర్గ టీడీపీ యువత, వాడపల్లి దేవస్థానం సిబ్బంది తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ – రాబోయే రోజుల్లో దేవస్థానం మరింత అభివృద్ధి సాధించేందుకు సరైన నాయకుడికి అవకాశం దక్కడం ఆనందకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎంతోమంది సీనియర్ నాయకులు ఈ దేవస్థాన చైర్మన్ పదవికి పోటీ పడిన కొత్తపేట నియోజకవర్గానికి తీసుకు రావడంలో అహర్నిశలు కృషి చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకి ప్రత్యేక అభినం దనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భావన శ్రీను,ప్రధాన కార్యదర్శి కముజు వరప్రసాద్, ఆత్రేయపురం మండల తెలుగు యువత అధ్యక్షుడు వెత్స అనిల్ కుమార్, రావులపాలెం మండల తెలుగు యువత అధ్యక్షుడు పుల్లగం వేణు శేఖర్ రెడ్డీ, కార్యదర్శి పప్పు రమేష్ రెడ్డీ,రావుల పాలెం గ్రామ



తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కోటా శ్రీహరి, రావులపాలెం గ్రామ యూత్ ప్రెసిడెంట్ ఆకుల రవితేజ, ఎండిఎస్. శ్రీనివాస్, అడ్డాల సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, కిట్టయ్య, యర్రంశెట్టి వెంకటశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.